హనుమంతుడికి దీపాలు వెలిగిస్తున్న ఆ సాధువుకి అన్నం వడ్డించాక బాధ పడుతూ చెప్పింది.

"మన్నించు తండ్రీ! ఇందాక పొరబాటున ఇల్లు తుడిచే గుడ్డని నీ చేతిలో పెట్టాను. అదిస్తే వెళ్ళేప్పుడు తీసుకువెళ్తాను."

"ఇంకెక్కడి గుడ్డ? ఐనా మన్నించడం దేనికి? మంచి పనే చేసావుగా? దాన్ని బాగా ఉతికి ఆరేసి, వత్తులు చేసి స్వామివారికి దీపాలు వెలిగించేసాను." చెప్పాడు సాధువు.

ఆ సాధువులా మనం ఈ ప్రపంచంలో దేన్నీ వ్యతిరేక దృష్టితో కాకుండా, అనుకూల దృష్టితో చూడగలగడం సరైన ఆధ్యాత్మికత.

## 6. ఆరు రూపాయలు

ఓ ఊళ్ళో రాముడ్ని కొలిచే వెంకట్రావు అనే ఓ భక్తుడు ఉండేవాడు. అయితే అతను బంగారం పట్టినా మట్టయ్యేది. దాంతో దరిద్రాన్ని అనుభవించే వాడు.

ఓ రోజు అతని భార్య అతనికి ఓ సలహా ఇచ్చింది.

"రాముడ్ని మన దరిద్రం తీర్చమని ప్రార్థించరాదూ? ఆయన మీ కోరిక తప్పక తీరుస్తాడు."

"పిచ్చిదానా! మనకేం కావాలో ఆయనకి తెలీదా? అందుకు నేనాయనకి సూచనలు ఇవ్వలేను." అతను ఒప్పుకోలేదు.

ఆ రాత్రి శ్రీరామచంద్రమూర్తి అతనికి కల్లో కనబడి చెప్పాడు.

"నీ ఇంట్లోని గూట్లో ఆరు రూపాయలు ఉన్నాయి కదా? అవి తీసుకుని రేపు సాయంత్రానికల్లా నువ్వు పెద్ద బజారుకి వెళ్ళు. అక్కడ ఆ ఆరు రూపాయలకి నీకు ఇష్టమైంది ఏది కనబడితే అది కొను. నీ దరిద్రం తీరుతుంది."

ఉదయం నిద్రలేవగానే తన భార్యకి ఆ కల గురించి చెప్పాడు.

"ఆయన చెప్పినట్లు చేయండి. ఒకవేళ అది ఉత్తుత్తి కలే అయినా ఖర్చయ్యేది ఆరు రూపాయలే కదా." సలహా ఇచ్చింది భార్య.

అతను సైకిలు మీద పెద్ద బజారుకి బయలు దేరాడు. ఓ చోట కోలాటం జరుగుతోంది. కోలాటం కర్రలు నచ్చి దాని ధరని అడిగాడు. జత పది రూపాయలు. ఇంకొంచెం ముందుకు సాగాడు. వేలంపాట వేసే ఓ హాల్లో బొమ్మలని వేలం వేస్తున్నట్లు బయట బోర్డుని చూసి లోపలకి వెళ్ళాడు. గోడకి ఓ పెద్ద చిత్రకారుడు గీసిన బొమ్మలు వేలాడుతున్నాయి. వాటిని కొనడానికి ఖరీదైన దుస్తుల్లో డబ్బున్న వాళ్ళు చాలామంది వచ్చారు. అతను వెనక్కి తిరగబోతూంటే పిచ్చి గీతలతో గీసిన ఓ బొమ్మని చూపించి చెప్పారు నిర్వాహకులు.

"దీని పేరు శ్రీరామచంద్రుడు. దీన్ని గీసింది దీపక్ అనే ఆరేళ్ళ కుర్రాడు. మా పాట అయిదు రూపాయలు."

చిన్న పిల్లవాడు గీసిన ఆ నైపుణ్యం లేని బొమ్మని కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. అసహనంగా పెద్ద చిత్రకారుడి బొమ్మల వేలంపాట మొదలవడం కోసం వారంతా వేచి చూడసాగారు.

"మొదటి సారి అయిదు రూపాయలు...రెండోసారి అయిదు రూపాయలు..."

అది తన ఇష్టదైవం అయిన రాముడి బొమ్మ అవడంతో, పైగా కలలో రాముడు చెప్పింది తు.చ. తప్పకుండా పాటించాలని అనుకోవడంతో వెంకట్రావు గట్టిగా 'ఆరు రూపాయలు' అని పాడాడు.

"ఆరు రూపాయలు. ఒకటో సారి...రెండో సారి..."

దాన్ని కొనడానికి అక్కడున్న వారు ఎవరూ ముందుకు రాకపోవడంతో, 'మూడో సారి' అని డబ్బు తీసుకుని ఆ బొమ్మని వేలంపాట నిర్వాహకులు వెంకట్రావుకి ఇచ్చారు. అక్కడున్న వాళ్ళంతా ఆ బొమ్మని కొన్న వెంకట్రావు వంక పిచ్చివాడి వంక చూసినట్లుగా చూసారు.

"వేలం పాట మొత్తం ముగిసింది." చెప్పారు నిర్వాహకులు.

"అదేమిటి? ఇంకా గోడకి వేలాడే ఆ అసలు బొమ్మలని వేలం వేయాలిగా?" అడిగారు వాటిని కొనడానికి వచ్చిన వాళ్ళు.

"ఈ బొమ్మలని గీసిన చిత్రకారుడు అతని వీలునామాలో ఏం రాసాడో వినండి. తన కొడుకు గీసిన బొమ్మని మొదటగా అయిదు రూపాయలతో వేలం వేయాలని, దాన్ని ఎవరు కొంటే వారికి తను గీసిన బొమ్మలన్నిటినీ వుచితంగా ఇవ్వాలని రాసాడు. ఎందుకంటే తండ్రిగా తన కొడుకు గీసిన బొమ్మ మీద అతని ప్రేమ అలాంటిది. కాబట్టి మీరు కోరుకున్న చిత్రాలని మీరు ఇతని నించి కొనుగోలు చేయండి."

ఇలాగే దేవుడికి కూడా తనని ప్రేమించే భక్తుడంటే, అతను ఎంత విలువ లేనివాడైనా సరే, ఆ చిత్రకారుడికి బాగా గీయలేకపోయినా తన బిడ్డ మీద వున్నంత ప్రేమ ఉంటుంది. ఆ ప్రేమని పొందగలిగిన వారు ధన్యులు.

## 7. ప్రార్ధన ఫలితం

ఒకామె ఓ మహాత్ముడి దగ్గరకి వెళ్ళి అడిగింది.

"నా భర్తకి కేన్సర్. దయచేసి ఆయనకి ఆ రోగం తగ్గేలా ప్రార్ధన చేయండి."

ఆ మహాత్ముడు అందుకు ఒప్పుకుని వరసగా నలభై రోజుల పాటు ఆమె భర్త ఆరోగ్యం కుదుట పడాలని తీవ్ర ప్రార్ధనని చేసాడు. ఓ రోజు ఆమె వచ్చి చెప్పింది.

"మా వారు మరణించారు."

"అరెరె! నిత్యం ప్రార్ధన చేస్తున్నానే?" ఆ మహాత్ముడు బాధగా చెప్పాడు.

"నాకు తెలుసా సంగతి. అందుకే మీకు కృతజ్ఞతలని చెప్పడానికి వచ్చాను. మా వారి వయసు నలభై ఎనిమిది. ఇంత చిన్న వయసులోనే ఇలాంటి ప్రాణాంతక రోగం వచ్చినందుకు ఆయనకి దేవుడి మీద కోపం వచ్చింది. నేను మీ దగ్గరకి రాక మునుపు 'ఎంతో శక్తి వంతుడైన దేవుడు తన ప్రాణాలని కాపాడలేడా' అని ఆలోచించేవారు. ఆయనకి దేవుడి మీద గల కోపాన్ని మా అందరి మీద ప్రదర్శించేవారు. ఆయన సమక్షంలో వుండటం మా అందరికీ దుర్భరంగా వుండేది. ఆయన తిట్టే తిట్లు సంస్కారవంతులు వినదగ్గవి కావు. కాని మీరు